సాక్షి

# 8 నెలల్లో భూ సేకరణ

- పాతబస్తీ మెట్రో అలైన్‌మెంట్ కోసం
- ఎంజీబీఎస్– చాంద్రాయణగుట్ట వరకు
- హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ మెట్రో అలైన్‌మెంట్ కోసం భూసేకరణను వేగవంతం చేసినట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో చేపట్టనున్న పాతబస్తీ మెట్రో ప్రాజెక్టు కోసం 8 నెలల్లో భూసేకరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ మార్గంలో రోడ్ల విస్తరణ, మెట్రో స్టేషన్ల నిర్మాణం కోసం సుమారు 1200 నిర్మాణాలను పాక్షికంగా లేదా పూర్తిగా తొలగించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ మేరకు ఇప్పటికే 400 ఆస్తులకు సంబంధించి భూసేకరణ కోసం నోటిఫికేషన్లు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 'జీహెచ్ఎంసీ మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగుల వెడల్పుతో హైదరాబాద్ మెట్రో రైల్ ఈ రూట్‌లో రహదారుల విస్తరణ చేపట్టింది. స్టేషన్ల వద్ద మాత్రం 120 అడుగుల వెడల్పుతో రోడ్లను విస్తరించనున్నారు. దారుషిఫా జంక్షన్ నుంచి శాలిబండ జంక్షన్ వరకు ప్రస్తుతం 50 నుంచి 60 అడుగుల వరకు మాత్రమే రోడ్లు ఉన్నాయి. శాలిబండ జంక్షన్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు రోడ్లు 80 అడుగుల వరకు ఉన్నాయి. దీంతో దారుషిఫా–శాలిబండ మధ్యలోనే ఎక్కువగా భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఈ రూట్‌లో ఒక్కో నిర్మాణం వద్ద 20 నుంచి 25 అడుగుల చొప్పున విస్తరణ చేయాల్సి ఉంటుంది. అలాగే శాలిబండ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మాత్రం ఒక్కో ఆస్తి 10 అడుగుల వరకు విస్తరించాల్సి ఉంటుంది. స్టేషన్లు, వంపు అధికంగా ఉన్న ప్రాంతాల్లోని ఆస్తుల విషయంలో మాత్రం రహదారి విస్తరణ ఎక్కువగానే ఉంటుంది' అని ఎన్వీఎస్ తెలిపారు.

**లైడార్ డ్రోన్ సర్వే పూర్తి..**

సాంప్రదాయ సర్వే పద్ధతులతో పాటు 3డీలో వీక్షించే విధంగా లైడార్ డ్రోన్ సర్వేను కూడా ఈ రూట్‌లో పూర్తి చేశారు. ఈ సర్వే వల్ల ప్రభావితం అయ్యే ఆస్తులతో పాటు చుట్టుపక్కల ఉన్న ఆస్తులను కూడా వీక్షించేందుకు అవకాశం ఉంటుంది.ప్రభావిత నిర్మాణాల విలువను అంచనా వేసేందుకు హెచ్ఏఎంఎల్ ఇంజినీర్లు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు ఎండీ తెలిపారు.